www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 31 డిసెంబర్ 2022





## విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

**ఒంటిమిట్ట :** మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 366 విద్యార్థులకు, 54 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను రాజంపేట ఎంఎల్‌ఎ మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యాభివృద్ధి కోసం జగనన్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి జనార్ధన్‌రెడ్డి, సర్పంచ్ కత్తి సుజాత, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్ రెడ్డి, ఎంపిటిసి నారాయణరెడ్డి, సర్పంచులు శేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటరెడ్డి శివ నారాయణ, కోఆప్షన్ సభ్యులు ఎస్ ఎం రఫీ, హై స్కూల్ చైర్మన్ అజమతుల్లా, ఓబుల్ రెడ్డి, సుబ్బారెడ్డి , కట్ట నారాయణ, హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సార్వత్రికానికి పక్కా సర్వే

- టిడిపి తరుపున ఆరు బృందాలు రంగంలోకి
- ఐదు నియోజకవర్గాల్లో సర్వేలు పూర్తి
- కమలాపురంలో కొనసాగుతున్న వైనం



**జిల్లాలో ఎన్నికలవేడి రాజుకుంది. 2024 ఎన్నికలకు ఏడాదిన్నర సమయం ఉండగానే అధికార, ప్రతిపక్షాలు తమదైన రీతిలో పోటాపోటీగా పలు కార్యక్రమాలతో రాజకీయ వేడిని రగిలించిన సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన ప్రతిపక్ష టిడిపి జిల్లాలో ఎలాగైనా మెరుగైన స్థానాలను దక్కించుకోవాలనే ఉద్దేశంతో పకడ్బందీగా పావులు కదుపుతోంది. పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల లొకేషన్ మ్యాపింగ్ సర్వేల ఆధారంగా ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. ఆరురకాల సర్వే బృందాలను రంగంలోకి దింపింది. ఇప్పటికే జిల్లాలోని ఏడింట్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో సర్వేల సంస్థలు పనిపూర్తి చేసినట్లు సమాచారం. సర్వే సంస్థలు సుమారు 10 అంశాల ఆధారంగా సర్వేలను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.**

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు గడప గడపకు ప్రభుత్వం, బాదుడేబాదుడు, ఇదేంఖర్మ ఇంటింటికి సిపిఎం, కౌలురైతు భరోసాయాత్ర వంటి పోటాపోటీ కార్యక్రమాలతో ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా జిల్లాలో మెజార్టీ స్థానాలను దక్కించుకోవాలనే ఉద్దేశంతో ప్రతిపక్ష టిడిపి శాస్త్రీయమైన ప్రణాళికలతో ముందుకెళ్తోంది. బాదుడే బాదుడు, ఇదేంఖర్మ వంటి తమదైన కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. మరోవైపు టికెట్ల కేటాయింపు విషయంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆరు సర్వే బృందాలను లొకేషన్ మ్యాపింగ్ ఆధారంగా క్షేత్రస్థాయి పరిస్థితుల మదింపు చేసే ప్రయత్నం చేస్తోంది. మండలాలు, మున్సిపాలిటీలు, వార్డుల్లోని ప్రధాన సమస్యలేమిటి, అధికారపార్టీ ప్రజాప్రతినిధులపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాల సేకరణ, ప్రతిపక్ష అభ్యర్థుల్లో ఎవరి పేరు ప్రస్తావనకు వస్తోంది. వారికి గల ఆదరణ తోపాటు సర్వే సంస్థలు 10 అంశాల ప్రశ్నావళి ఆధారంగా నివేదికను రూపొందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఐదింట్లో సర్వే పూర్తి**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ, కడప పార్లమెంటు స్థానాలపై సర్వేలు లొకేషన్ మ్యాపింగ్ సహాయంతో సర్వేలు శాస్త్రీయమైన దక్పథంతో చేపడుతున్నట్లు తెలుస్తోంది. కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేల్ నియోజకవర్గాల్లో సర్వేలు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. వీటిపై సర్వే సంస్థలు ఇచ్చే నివేదికల్లో మెజార్టీ నివేదికల ఆధారంగా టికెట్ల కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత అధికార వైసిపి అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శాస్త్రీయంగా ముందుకెళ్లిన తరహాలోనే ముందుకెళుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఈలెక్కన సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు పైరవీలు పని చేయవనే వాదన వినిపిస్తోంది.

**కమలాపురంలో కొనసాగుతున్న సర్వే**

జిల్లాలో ఏడు అసెంబ్లీ పరిధిలో ఐదింట్లో సర్వే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల్లో కమలాపురం నియోజకవర్గంలో సర్వే సంస్థలు సర్వేలను కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కమలాపురం అసెంబ్లీ వైసిపి, టిడిపి మధ్య పోటాపోటీ వాతావరణం, ఓట్ల మెజార్టీలు సైతం ఐదు వేల నుంచి పది వేల లోపు స్వల్పంగానే ఉంటున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో కమలాపురం అసెంబ్లీ పరిధిలో ప్రధాన సమస్యలు ఏమిటి, టికెట్ల ఆశావహుల్లో ఎవరికి ఆదరణ ఉంది. స్థానిక ఎమ్మెల్యే పట్ల ప్రజల్లో స్పందన ఎలా ఉంది. ప్రధాన సమస్యల పరిష్కారంలో ఆయన పని తీరు, ఇతర అంశాల ఆధారంగా సర్వే కొనసాగుతున్నట్లు సమాచారం. కమలాపురంలో ఇద్దరు ప్రధాన నాయకులు ఎవరికి వారు తమకే టికెట్ అనే వార్తలను ప్రచారంలో పెట్టిన సంగతి తెలిసిందే. సర్వేలు ఎవరి వైపు మొగ్గు చూపు తాయో ఉత్కంఠ నెలకొంది.

**గెలుపు గుర్రాలపై ఆరా**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ, కడప పార్లమెంట్ స్థానాలకు టికెట్ల కేటాయింపు అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ప్రతిపక్ష టిడిపి కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు టిక్కెట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాలోని ఏడు అసెంబ్లీలకు ఎవరికి టికెట్ కేటాయించాలనే అంశంపై సర్వే బృందాల నివేదికలు తేల్చనున్నట్లు తెలుస్తోంది. సర్వే నివేదికల ఆధారంగా ఆయా అభ్యర్థులకు టికెట్లు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ప్రజల ఆదరణ, సామాజిక, ఆర్థిక, అంగబలాలు కలిగిన నాయకులకు టికెట్లు కేటాయించే అంశంలో రాజీపడే అవకాశాలు లేవనే అంశాన్ని ప్రచారంలో పెట్టడం గమనార్హం.

# సిఐటియు అన్ని రంగాల్లో విస్తరించాలి

**ప్రజాశక్తి-కడప అర్బన్**

బలమైన కార్మిక వర్గ పోరాటాలు నిర్వహించాలని, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ మానుకోవాలి, సిఐటియు అన్ని రంగాల్లో విస్తరించాలని సిఐటియు 9వ జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకాసి పిలుపు నిచ్చారు. శుక్రవారం యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ప్రతినిధుల సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని రంగాలలో కార్మిక వర్గ సమస్యలపై సిఐటియు నిరంతర పోరాటాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. వారి సంక్షేమం కోసం ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ భద్రత, పని భద్రత సమస్యలపై సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికుల శ్రమను యధేచ్ఛగా దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. కార్మికుల చట్టాలు ఏ మాత్రమూ అమలు కావడం లేదని తెలిపారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న బోజన కార్మికులు నిత్యం రాజకీయ వేధింపుల గురవుతున్నారని, తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీలో, ధర్మల్ ప్రాజెక్టులలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి విఫలమయ్యారని విమర్శించారు. మహాసభలలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బి. మనోహర్, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ ఆచారి, శ్రీనివాసులు, రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్ర శేఖర్, లక్ష్మీదేవి, నాగేంద్ర, జిల్లా నాయకులు భైరవ ప్రసాద్, గోపి, విజయ కుమార్, రవి, వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. **తీర్మానాలు ..** విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ మానుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని జెన్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న పని చేస్తున్న 23,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, ఐసిడిఎస్ పరిరక్షించాలని, జిల్లాలో రాజకీయ వేధింపులు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ వేతనాలు, కూరగాల బిల్లులు వ్వాలని, అసంఘటితరంగా కార్మికుల సంక్షేమం కోసం ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, పారిశ్రామిక ప్రాంతాలలో కనీస వేతనాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను యధేచ్ఛగా దోపిడీకి గురిచేస్తున్నారని, కార్మిక చట్టాలు అమలు చేయాలని తీర్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బాలకాశి

## జెవివి డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

జన విజ్ఞాన వేదిక డైరీని కలెక్టర్ విజయరామరాజు, జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రీయ ప్రచారంలో భాగంగా సైన్స్ ప్రచారాన్ని చేస్తున్న జనవిజ్ఞాన వేదిక పిల్లల్లో సృజనాత్మకను పెంపొందించే సైన్స్ సంబరాలను నిర్వహిoచడం, అక్షరాస్యత ఉద్యమాన్ని, దేశభక్తి ప్రచారాన్ని, సీజనల్ వ్యాధుల పై అవగాహన, మూఢనమ్మకాలపై అవగాహన లాంటి కార్యక్రమాలతో ముందుకు సాగడం సంతోష కరంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బాలయ్య, బయన్న, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, వెంకటరామరాజు, సరస్వతి, సునీత కోశాధికారి షామీర్ భాష ,అబ్బాస్ వలి, వసంత్, కిరణ్ , మధుసూదన్ పాల్గొన్నారు. **యుటిఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కణ** జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం డిఇఒ సి. దేవరాజు యుటిఎఫ్ నూతన సంవత్సర 2023 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలకే పరిమితం కాకుండా సామాజిక సమస్యల్లో కూడా పాలు పంచుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, గౌరవాధ్యక్షులు ఎస్.ఓబుల్ రెడ్డి, ట్రెజరర్ కె.నరసింహారావు, నాయకులు పి.కిరణ్ కుమార్, వీర నారాయణ, మాలే బాబు, షామీర్, కడప మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నాగరాజు, అస్లాం పాల్గొన్నారు. **ఎస్‌టియు ఆధ్వర్యంలో..** వివిఆర్ ఎస్‌టియు భవనంలో జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి ఆధ్వర్యంలో హరూన్ బజాజ్ మేనేజింగ్ డైరక్టర్ ఎస్.బి.అహ్మద్ బాషా, ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సి.విద్యాసాగర్ రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, గురుకుమార్, ఇలియాస్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవరెడ్డి, వైద్యులు నాగార్జునరెడ్డి, రాజ అహమ్మద్, విశ్వనాథరెడ్డి, జయరామయ్య, రెడ్డన్న, సుబ్బారెడ్డి, రామ్మోహన్, సంజీవరాయుడు, కరీముల్లా పాల్గొన్నారు. **డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..** భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ అధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్ ను డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాసి,మాజీ జిల్లా కార్యదర్శులు బి.మనోహర్, జి.చంద్రశేఖర్ శుక్రవారం యూటీఎఫ్ భవన్‌లో ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ముడియం.చిన్ని, వీరనాల.శివకుమార్ డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి, సుబ్బయ్య, డివైఎఫ్ఐ నగర అధ్యక్ష,కార్యదర్శులు శాకీర్, డి.ఎం.ఓబులేసు, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్,నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.


జెవివి డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

## నేరాల సంఖ్య తగ్గుముఖం : ఎస్‌పి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఈ ఏడాదిలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గాయని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. జిల్లాలో పోలీస్‌శాఖ సాధించిన విజయాలు, నేర గణాంకాలపై శుక్రవారం విలేకర్లకు వివరించారు. చోరీ కేసుల్లో 81 శాతం రికవరీతో రాష్ట్రంలోనే మేటిగా జిల్లా పోలీస్ శాఖ నిలిచిందని తెలిపారు. పటిష్ట నిఘా, నిరంతర గస్తీతో చోరీ కేసుల్లో గత ఏడాదితో పోల్చితే 8 శాతం తగ్గుదల నమోదయిందని చెప్పారు. ప్రత్యేకంగా కోర్టు మానిటరింగ్ సెల్ ఏర్పాటుతో శిక్షల శాతం పెరిగిందన్నారు. ప్రొద్దుటూరు ట్రిపుల్ మర్డర్ కేసులో నేరస్తుడికి ఉరిశిక్ష, వేముల హత్యకేసులో ఏడుగురికి జీవితఖైదు, సి.కె దిన్నె పోక్సో కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు పడిందని తెలియజేశారు. రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ఫ్యాక్షన్ కను మరుగుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. 'ఆపరేషన్ ముస్కాన్' లో 203 మంది బాలలను కాపాడి సంరక్షణ కేంద్రాలకు తరలించామని తెలిపారు. 503 మంది చిన్నారులను డ్రాప్ ఔట్లను గుర్తించి తిరిగి విద్య చెంతకు పోలీసులు చేర్చారని చెప్పారు. 54 బాల్యవివాహాలను నిరోధించి సంరక్షణ కేంద్రాలకు తరలించామన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపామని పేర్కొన్నారు. అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాళ్ళ ఆట కట్టించామని చెప్పారు. పోలీసు కుటుంబాల సంక్షేమ కోసం పోలీస్ సంక్షేమ ఆస్పత్రిలో ఉచితంగా ఇసిజి, రక్తపరీక్షలకై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పోలీసు కుటుంబాల చిన్నారులకు ప్రోత్సాహకంగా నగదు స్కాలర్ షిప్‌లు అందజేశామని చెప్పారు. సమావేశంలో ఎఎస్‌పి తుషారా డూడి పాల్గొన్నారు.

## అందరికీ విద్య కోసం ఉద్యమిద్దాం

**కడప అర్బన్ :** అందరికీ విద్య, ఉపాధి కోసం ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సురేష్‌నాయక్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నగరంలోని ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాల మాజీ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ 1970లో కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని చెప్పారు. అప్పటి నుంచి విద్య ప్రయివేటీకరణఖు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకై దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్. నాయక్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు బుక్కే సురేష్ నాయక్, పవన్ కళ్యాణ్, డివైఎఫ్ఐ నాయకులు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసరాలు అందజేత

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ఇసిఇ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నగరంలోని పాత రిమ్స్‌లో ఉండే ఆల్ షిఫా మానసిక, శారీరక వికలాంగుల కేంద్రం విద్యార్థులకు ఒక నెలకు సరిపడు నిత్యవసర వస్తువులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్నారు. ప్రతి ఒక్కరూ సేవ చేయడం అలవరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇసిఇ డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ జి. సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న విద్యార్థులు

## రహదారుల భద్రత కోసం చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ప్రజల ప్రాణ భద్రతే ధ్యేయంగా రహదారుల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న పటిష్టమైన చర్యలను జిల్లా అధికారులు విధిగా అమలు చేయాలి కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. పండుగలు, సెలవు రోజుల్లో పబ్లిక్ ప్రదేశాలు, బైపాస్ రోడ్డులలో యువకుల అత్యుత్సాహం, అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. రానున్న నూతన సంవత్సర వేడుకల సమయంలో మితిమీరిన ఆనందోత్సాహాలతో యువకులు రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను అరికట్టాలన్నారు. నగర రహదార్లల్లో ఎక్కడా అతివేగంతో వాహనాలు నడపడం, రోడ్లపై బైకుల విన్యాసాలు చేయడం వంటి సందర్భాలు కనిపించకూడదన్నారు. ఆయా శాఖల వారీగా బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు తీసుకుని, ఫొటోతో సహా నివేదికను ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్కూల్ జోన్లలో రహదారుల భద్రత, ట్రాఫిక్ రూల్స్ తెలిపే గుర్తులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, కడప డిఎస్‌పి వెంకట శివారెడ్డి, డిఎంహెచ్ఒ నాగరాజు, ట్రాఫిక్ డిఎస్‌పి, ఎంవిఐలు, డిసిహెచ్ఎస్, రిమ్స్ సూపరింటెండెంట్, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖ ఎస్ఇలు పాల్గొన్నారు.

## 'వ్యవసాయం'పై విద్యార్థులకు అవగాహన

**పోరుమామిళ్ల :** నేటి తరం విద్యార్థులకు వ్యవసాయ రంగం ప్రాముఖ్యతను గూర్చి అవగాహన కల్పించడం ఎంతైనా అవసరమని శ్రీ వైష్ణవి సిబిఎస్ఇ స్కూల్ కరస్పాండెంట్ అర్. వి రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మండలంలోని రంగ సముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని పరిసర ప్రాంతాలలో వివిధ రకాల పంటలు, పంటలు పెరిగే క్రమం, పంటలకు వచ్చే చీడ పీడలు, పంట దిగుబడులు, రైతు సమస్యలు మొదలగు వాటి మీద అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కల్యాణి, ప్రిన్సిపాల్ ఆర్. మల్లికార్జున, విద్యార్థులు, రైతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాళ్ల దాడి దుర్మార్గం

**కడప అర్బన్ :** పుంగనూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా బాబు వాహనంపై వైసిపి మూకలు రాళ్లతో దాడి చేయడం దుర్మార్గమని టిడిపి పోలీసు పోలీసు సభ్యులు శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదేంఖర్మ కార్యక్రమంతో వైసిపి నాయకులకు ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. చల్లా బాబుకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్చుకోలేక ఇలాంటి నీచ పనులు వైసిపి శ్రేణులు చేస్తున్నాయని తెలిపారు. ప్రజలే మీకు బుద్ధి చెప్తారని తెలిపారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్

## 'ఆర్కిటెక్చర్' విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన

**కడప అర్బన్ :** నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు అతి ప్రాచీన చెన్నకేశవ స్వామి దేవాలయం (పుష్పగిరి) సందర్శించారు. సిలబస్‌లో భాగమైన స్టడీ టూర్‌లో విద్యార్థులు ప్రాచీన దేవాలయాలు కట్టడాలు అందులో ఉండే శిల్ప శైలి, సాంకేతిక నైపుణ్యం గురించి తెలుసుకున్నారు. ఆధునిక శిల్పకళలలో ప్రాచీన శిల్ప శైలి ప్రాముఖ్యతను అర్థం చేసుకుని భావితరాలకు అందించడమే స్టడీ టూర్ ముఖ్య ఉద్దేశం అని విద్యార్థులకు అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో శిల్ప కళా విభాగం కో-ఆర్డినేటర్ సి.హెచ్.దుర్గా ప్రసాద్, సుకుమార్, సీనియర్ అధ్యాపకులు కె. అప్పల్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. సుకుమార్, సీనియర్ అధ్యాపకులు కె. అప్పల్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వడం శోచనీయం

**పోరుమామిళ్ల టౌన్ :** పింఛనుదారులకు నోటీలు ఇవ్వడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొనేళ్లుగా వృద్ధాప్య , వితంతు పింఛన్లు తీసుకున్న వారికి జనవరి నుంచి రాదని నోటీసులు ఇవ్వడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వాపోయారు. వివిధ కారణాలు చూపి పింఛన్లు తొలగించడం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడలని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం మాట తప్పం, మడమ తిప్పం అంటూ అధికారంలోకి వచ్చి, ఇప్పుడు దానికి పూర్తిగా భిన్నంగా వ్యవహరించడం శోనీయమని విమర్శించారు. సంక్షేమ కార్యక్రమాల్లో కోతలు విధించడం దారుణమని తెలిపారు. ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకొని, పెన్షన్లు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడిగి శ్రీను పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా : సర్పంచ్

**పోరుమామిళ్లటౌన్ :** పోరుమామిళ్ల గ్రామపంచాయతీ పరిధిలో ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తానని సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవర ణంలో ఉన్న సంపు దగ్గర 7.5 హెచ్‌పి మోటర్‌ను ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరుమామిళ్ల పట్టణం అన్ని రంగాలలో వేగం గా అభివృద్ధి చెందుతుందని, పట్టణంలో ఉన్న సరిపడినంత నీరు అందిం చడమే తన బాధ్యత అన్నారు. ఎక్కడా తాగునీటి సమస్య రాకూడదని చర్యలు చేపడ తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగులకు సన్మానం

**కడప అర్బన్ :** ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఎంతో కాలంగా పనిచేస్తున్న చిరు ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వివే కానంద రెడ్డి మాట్లాడుతూ పాఠ శాలలు పాటు చిరు ఉద్యోగుల సేవలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ వల్ల పాఠశాల శుభ్రత, విద్యార్థులకు నాణ్యత దొరుకుతుందని పేర్కొన్నారు. అటువంటి వారిని గుర్తించి సన్మానం చేసిన రోజు వారిలో మరింత నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. బస్ కండక్టర్ నారాయణ, నాగరాజు, సబిరున్నీషా, బాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీన్ శివ, ప్రిన్సిపల్ హరికృష్ణ, పిఇటిలు జయచంద్ర, లక్ష్మయ్య, పరిపాలన అధికారి ఓబుల్ రెడ్డి, సంధ్య మేడం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సిబ్బందిని సన్మానిస్తున్న వివేకానంద రెడ్డి

## కేంద్రీయ విద్యాలయ అభ్యున్నతికి కృషి

**కడప అర్బన్ :** కేంద్రీయ విద్యాలయలో మౌలిక వసతులు మెరుగుపరచి, విద్యార్థుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కెవి పేరెంట్స్ అసోసియేషన్ కోశాధికారి సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం కడప ప్రెస్ క్లబ్‌లో వై. మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో కెవి యాజమాన్యం కృషిచేయాలన్నారు. మున్సిపల్ వాటర్ కనెక్షన్ ఇవ్వాలని, మరో బోర్ వెల్ వేయాలని, కంప్యూటర్,సైన్ ల్యాబ్ ,లైబ్రరీలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెవికె బస్ రూట్ కన్వీనర్ సి.నారాయణ, కమిటీ సభ్యులు బి. మురళీ మోహన్, ఎల్.ఎస్. శివప్రసాద్, ఎస్. శిరీష, కె.పావని, ఎస్.సంజీవ రెడ్డి, కె .కె. పవిత్రన్, పి.రామకృష్ణ, ఎం.సి.శివనాగయ్య పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో అలక్ష్యం వద్దు : ఎమ్మెల్సీ

**పోరుమామిళ్ల టౌన్ :** పోరుమామిళ్ల, బి. కోడూరు మండలాల్లోని సచివాలయ కౌన్సిర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంఎల్‌సి డి.సి. గోవిందరెడ్డి, ఎంఎల్‌ఎ డాక్టర్ సుధా, నియోజకవర్గ పరిశీలకులు జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నవంత్నాలపై సమీక్షించారు. జగనన్న కాలనీల నిర్మాణంపై అలసత్వం వద్దని, వేగవంతంగా కాలనీ నిర్మాణాలు రూపుదిద్దుకోవాలని డి.సి. గోవింద రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల, బి. కోడూరు మండలాల వాలంటీర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా ఇక్బాల్

**కడప అర్బన్ :** కడప జిల్లా ఎలిమెంటరీ, సెకండరీ స్కూల్స్ టీచర్స్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయునికీ ప్రభుత్వ తరుపున ఇంటి స్థలం సాధించేందుకు సొసైటీ ఆధ్వర్యంలో సమిష్టి కృషి చేస్తామని పేర్కొన్నారు. పబ్బాపూరం ప్లాట్లకు అభివృద్ధి పరుస్తామని, ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జనరల్ బాడీ సభ్యులకు, మిత్ర సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 108 రౌండ్ల సూర్య నమస్కారాలు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

భారతీయ యోగాను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన స్వామి విష్ణు దేవానంద జయంతి సందర్భంగా పటేల్ రోడ్ లోని మిత్ర యోగా సెంటర్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో 108 రౌండ్ల సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, యోగా నిపుణులు డాక్టర్ ఆర్. రంగనాథ్ రెడ్డి మాట్లాడుతూ యోగ సాధనలో సూర్య నమస్కారాలకు ప్రముఖ స్థానం ఉందని, తక్కువ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శారీరకంగా దృఢత్వాన్ని సాధించవచ్చని చెప్పారు. మిత్ర యోగ సెంటర్ లో 30 రోజులపాటు నిర్వహించబడే యోగా క్రొత్త బ్యాచ్ ను జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 5:30 నుంచి 7:00 గంటల వరకు ఉంటుందని, పూర్తి వివరాలకు 9848861206, 7013238986లలో సంప్రదించాలని ప్రముఖ యోగా తెరపిస్ట్ డాక్టర్ కె. కల్పన తెలిపారు.


సూర్య నమస్కారాల్లో యోగా సాధకులు

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**పోరుమామిళ్లటౌన్ :** 'నూతన సంవత్సర సందర్భంగా సిబిటి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ కడప జిల్లా ఉమెన్స్ కమిటీ వారు శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర, ఐత్రం పేట సర్పంచ్ పవన్, దావీదు, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, మానవ హక్కుల కమిటీ సెక్రెటరీ, చెన్నమ్మ పాల్గొన్నారు.

## 'ఇదేం ఖర్మ'పై సమావేశం

**పోరుమామిళ్ల టౌన్ :** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు భైరప్రసాద్, మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అధ్యక్షతన జనవరి 2న నిర్వహించబోయే ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నిర్వహించబోయే కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రామ సుబ్బారావు, శ్రీశైలం బోర్డు మాజీ సభ్యులు సీతా వెంకటసుబ్బయ్య, మాజీ ఎంపిటిసి ఇమామ్ హుస్సేన్, మాజీ సర్పంచ్ ఎస్.ఎం బాష , ప్రొఫెసర్ బాష, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు మస్తాన్, అతికారి రాజ, ధర్వేస్, పఠాన్, చిన్నం ప్రసాద్, లక్ష్మీనారాయణ, రామయ్య పల్లె రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నారా లోకేష్ యువతకు ఆదర్శం

**కడప అర్బన్ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతకు ఆదర్శమవుతారని కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద యువగలం పేరుతో నిర్వహించే పాదయాత్రకు సంఘీభావ బ్యానర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు నక్కల శివరాం, ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, అధికార ప్రతినిది అమూరి బాలదాసు, తెలుగు యువత అధ్యక్షులు మేకల వేంకటేష్‌యాదవ్, రాష్ట్రనాయకులు సి.ఎస్. నాసర్ అలీ, సానపు రెడ్డి రవిశంకర్ రెడ్డి, నబీకోట్ శ్రీనివాసులు, కోమ్మలపాటి సుబ్బరాయుడు, రాయల్ కరీముల్లా, నరసింహులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా సాగిపోవాలి

**ప్రజాశక్తి- కడప అర్బన్**

మహిళలు ఆకాశమహద్దుగా ముందుకు సాగిపోవాలని, అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుబ్బలక్ష్మమ్మ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యువతులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఇన్ యూత్ లీడర్షిప్ అండ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ కార్యక్రమం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో చేస్తున్న పలు కార్యక్రమాలు యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. తమ కళాశాల పూర్వ విద్యార్థి మిద్దె రూప భారతి పార్లమెంటులో ప్రసంగించే అవకాశం దక్కించుకున్నదంటే అందుకు కారణం యువ అధికారి మణికంఠ అని తెలిపారు. నిహార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రతినిధులు ఇంతియాజ్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తమ కేంద్రంలోని ఇవ్వడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గురివిరెడ్డి, గురు మోహన్ రెడ్డి, యోగ గురువు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి పాల్గొన్నారు. యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

## గ్రామాల్లో వైద్య సేవలు

**కాశినాయన :** అన్ని గ్రామాలలో ఫ్యామిలీ ఫిజీషియన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నామని నర్సాపురం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రశాంతి తెలిపారు శుక్రవారం ఆమె తన సిబ్బందితో గుంటూరువారిపల్లె గ్రామంలో వైద్య సేవలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 104 వాహనం నెలలో రెండు సార్లు ప్రతి గ్రామానికి వస్తుందని, అందులో అందించే వైద్య సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చేసుకోవాలని సూచించారు. నడవలేని వారికి ఇంటి దగ్గరికి వచ్చి బీపీ, షుగర్ చేస్తున్నామని తెలిపారు కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 3 నుంచి పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

**కడప అర్బన్ :** యోగివేమన విశ్వ విద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పీజీ కోర్సులలో నేరుగా ప్రవేశాల కోసం జనవరి 3 నుంచి 6 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్, నిర్ణీత ఫీజుతో విశ్వవిద్యాల యంలోని ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో ఉన్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**



డిఎస్‌పి శ్రీనివాసులు

డిసెంబర్ 31 రాత్రి యువత మద్యం సేవించి రోడ్లపై కేకులు కట్ చేయడం, అల్లరు చేస్తూ, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి హద్దులు మీరి ప్రవర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. రాత్రి నగరంలో పోలీసుల గస్తీ ముమ్మరంగా ఉంటుందన్నారు. అర్ధరాత్రి 12.30 గంటల తర్వాత ప్రజలు రోడ్లపై తిరగరాదని సూచించారు. మద్యంతాగి యువత ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసేసి ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డిఎస్‌పి ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## పింఛనుదారులు ఆందోళన చెందొద్దు : ఎంపిడిఒ


**ప్రజాశక్తి - వేంపల్లె**

పింఛను పోతుందేమోనని లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఏ ఒక్క పింఛను రద్దు కాదని ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందరి ఫించన్‌దారులకు కొన్ని కారణాల వల్ల వాటిని పరిష్కరించుకోవాలని వాలంటీర్లు చెప్పారన్నారు. అంతే తప్ప ఒక్క ఫించను కూడా రద్దు చేయడం జరగదని ఆయన పేర్కొన్నారు. ఆందోళన చెందకుండా విద్యుత్ అధికారుల నుండి లేదా తమకొచ్చే నోటీసులకు సచివాలయంలో ఇవ్వాలని లబ్ధిదారులకు సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్, రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పుకార్లను లబ్ధిదారులు నమ్మరాదని ఎంపిడిఒ తెలిపారు.

## చంద్రబాబు దృష్టికి బిసిల సమస్యలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

టిడిపి అధికారంలోకి రాగానే బిసిల సమస్యలను పరిష్కరించాలని దాసరి కుల రాష్ట్ర కన్వీనర్ తుపాకుల ఉప్పారావు విన్నవించారు. శుక్రవారం కావలి పట్టణం బృందావన కళ్యాణ మండపంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బిసిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాకుల ఉప్పారావు మాట్లాడుతూ ప్రస్తుత దాసరి కులానికి తగిన ప్రాధాన్యత లేదని, పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న రోజుల్లో ఏపికి 50 అసెంబ్లీ స్థానాలు పెరుగుతున్నాయని దాసరి కులానికి, సంచార జాతులకు క్యాబినెట్ హోదా పదవులు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. దాసరి కులానికి టిటిడి బోర్డు మెంబర్ పదవి కల్పించాలన్నారు. ఆలయ పాలకమండల్లో దాసరి కులానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ కన్వీనర్ గోవిందు సుబ్బయ్య, దాసరి సాధికార సమితి రాష్ట్ర మెంబర్ ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు, దాసరి సాధికార రాష్ట్ర నెంబరు తుపాకుల శివలక్ష్మి, దాసరి సాధికార సమితి రాష్ట్ర నెంబరు తుపాకుల హరికృష్ణ, చిత్తూరు జిల్లా పార్లమెంట్ కన్వీనర్ జయచంద్ర, తిరుపతి, నెల్లూరు జిల్లాలోని దాసరి కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడును సన్మానిస్తున్న ప్రతినిధులు

## తొక్కిసలాటలో మరణించడం బాధాకరం

**ఖాజీపేట:** నెల్లూరు జిల్లా కందుకూరులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుని పలువురు మృతి చెందడం బాధాకరమని టిడిపి కడప జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి జెండాల మహబూబ్ బాషా విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, తెలుగుదేశం పార్టీపై ఉన్న అభిమానంతో అభిమానులు బహిరంగ సభకు తరలివచ్చారని తెలిపారు. మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా నిలిచిందన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టనున్న పాదయాత్ర అడ్డుకుంటామని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొనడం సబబు కాదన్నారు. పాదయాత్రను సజావుగా సాగనివ్వాలన్నారు. **ఎర్రగుంట్ల :** బిటిపిఎస్‌లోని ఫౌంటెన్ వద్ద కందుకూరు ఘటనలో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు శుక్రవారం స్థానిక టిడిపి నాయకులు సంతాపాన్ని తెలిపారు. ఘన నివాళులు అర్పించారు. మృతుల ఫోటోల ముందు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మాజీ ఎంపిటిసి రమణయ్య, పొన్న శివశంకర, రామ్‌ప్రసాద్, కుమార్‌రాజా, పొన్న చంద్ర, క్రిష్ణ, రాజశేఖర్ పాల్గొన్నారు.

## 'సీమ'లోనే కృష్ణానది బోర్డు ఏర్పాటు చేయాలి

### పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

**వేంపల్లె :** కృష్ణ నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని రాయలసీమ ప్రాంతంలోని కర్నూలులో ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణ నది యాజమాన్య బోర్డ్ కార్యాలయాన్ని హైదరాబాద్ నుండి రాయలసీమకు కాకుండా విశాఖ పట్టణానికి తరలించాలని వైసిపి ప్రభుత్వం నిర్ణయించడం గర్హనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 సెక్షన్ 85 ప్రకారం గోదావరి నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రంలో, కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలన్నారు. కాని రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదిన్నర సంవత్సరాలైనా రెండు కార్యాలయాలూ హైదరాబాద్‌లో ఉండడం శోచనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని విమర్శించారు.

## నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు

**పులివెందుల టౌన్ :** నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు వస్తుందని అమృత హస్త సేవా సమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వీధికి చెందిన బూచుపల్లె లక్ష్మీదేవమ్మ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె కుమారులు మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డిలు నేత్ర దానానికి అంగీకరించారు. రాజుకు సమాచారమిచ్చారు. ఆ మేరకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి టెక్నీషియన్ హరీష్ లక్ష్మీదేవమ్మ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి అందజేశారు.

## అనాథలకు దుప్పట్లు పంపిణీ

**పులివెందుల టౌన్:** మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ కమలాపురం, స్నేహిత అమృత హస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనాథలకు, యాచకులకు, నిరాశ్రయులకు, అభాగ్యులకు పట్టణ ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు, మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చలికాలంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమన్నారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా దాతల సహకారంతో నాణ్యమైన దుప్పట్లు పట్టణంలో 30 మందికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో శ్రీరామ కళా నిలయం డాన్స్ మాస్టర్ రాజా, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, సేవా సమితి సభ్యులు మహమ్మద్ రఫీ, రాజా పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలి : డిఇఒ

**రాయచోటి:** జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన ధ్యేయంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీఒ హోమ్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ, పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహ నిర్మూలనకు జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నివారించడంలో భాగంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు పొందేలా, పిల్లలందరూ చదువుకునేలా ప్రభుత్వం అమ్మఒడి కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. అనంతరం పోర్డ్ డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కన్వెన్షన్ సమావేశాలు జిల్లా స్థాయిలో తప్పనిసరిగా ప్రతి నెల నిర్వహించి బాల్య వివాహ నిర్మూలనపై చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా శిశు సంక్షేమ అధికారి బాల్యవివాహాల నిర్మూలన కోసం ఈ చట్టం పరిధిలో ఎప్పుడు జాగ్రత్త వహిస్తూ మహిళలు, బాలికలలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక అధికారి, మదనపల్లి, వాల్మీకిపురం సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# సామాజిక పింఛన్ల రద్దు అన్యాయం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

సామాజిక పింఛన్లకు వైసిపి ప్రభుత్వం మంగళం పాడేందుకు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దు టూరులో 2,170 మంది లబ్ధిదారులకు నోటీసులిచ్చారని తెలిపారు. కుల మతాలకు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామని ప్రభుత్వం మాట తప్పుతోందని విమర్శించారు. నోటీసులిచ్చిన వారిని పిలిపించి ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇవ్వాలన్నారు. కందుకూరు ఘటనపై ఎమ్మెల్యే రాచమల్లు మాటలు బాధాకరమన్నారు. 2023 జనవరి నుండి డోర్ టూ డోర్ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టబోతున్నామని తెలి పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు ఆయన వివరించారు. టిడిపిపై అభిమానం ఉన్న ప్రతి ఒక్కరు సంప్రదించాలన్నారు. అందరిని కలుపుకుపోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జనవరి 27 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం యువగళం కార్యక్రమం నారా లోకేశ్ చేపట్టబోతున్నారన్నారు. 2024 ఎన్నికలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చివరి ఎన్నికలు అయ్యేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విఎస్ ముక్తియార్, పట్టణ అధ్యక్షుడు ఇ.వి.సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర బిసి నాయకుడు తాటి శ్రీనివాస్ యాదవ్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, సిద్దయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

# 'రాజోలు' ఎత్తు తగ్గించడం తగదు

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

కుందు నది మీద కెసి కెనాల్ రైతుల కోసం ఉద్దేశింపబడిన రాజోలు రిజర్వాయర్ ఎత్తు 2.95 టిఎంసి నుండి తగ్గించడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజోలు రిజర్వాయర్ కోసం తీసుకుంటున్న రైతుల భూముల పరిహారంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటూ వారిని మోసం చేయడం సరికాదన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారం ఇచ్చేలా, రిజర్వాయర్ సామర్థ్యం 2.95 టిఎంసి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కెసి కెనాల్ కింద కడప జిల్లాలో ఉన్న దాదాపు 98 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే కుందు నది ద్వారా వృథా సోమశిల కండలేరు ద్వారా సముద్రం పాలయ్యే నీటిని నిల్వ చేయడానికి ఉద్దేశింపబడిన ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని తగ్గిస్తే కెసి కెనాల్ రైతులకు ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించాలని సూచించారు. కలెక్టర్ స్వయంగా సామర్థ్యాన్ని తగ్గిస్తున్నట్లు ఒప్పుకున్నారనే వార్తలు వస్తున్నాయన్నారు. దీనిపై కలెక్టర్ తగిన వివరణ ఇచ్చి రైతులను శాంతింపజేయాలని కోరారు. ఇందుకోసం భూముల కోల్పోతున్న రైతులు దాదాపు జమ్మలమడుగు నియోజకవర్గంలోనే ఉన్నారని, నీటిపారుదల విషయానికి వచ్చేసరికి ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం, మైదుకూరు నియోజకవర్గం, కమలాపురం, కడప నియోజకవర్గంలో ఉందన్నారు. భూములు కోల్పోతున్న రైతులది త్యాగమే అవుతుందన్నారు. వారిని అవమానించేలా రాజకీయ నాయకులు మాట్లాడడం సరికాదన్నారు. దాన్ని గుర్తించకుండా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# 'ప్రభుత్వ పథకాలు మరింత చేరువ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సర్పంచులు, వాలంటీర్లు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సూచించారు. మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి నివాసంలో శుక్రవారం ఎమ్మెల్యే మండలస్థాయి సచివాలయ కన్వీనర్లు, డైరెక్టర్లు, సర్పంచులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులకు లబ్ధి చేకూరేలా పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటూ, వారిని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రదీప్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్, ఉప సర్పంచు వీరాంజనేయరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, వైసిపి నాయకులు శంకర్‌రెడ్డి, మౌనిక మిల్క్ డెయిరీ ఎండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

**చాపాడు :** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక వైఎస్ కళ్యాణ మండపంలో శుక్రవారం ఆయన వైసిపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ప్రస్తుతం వైసిపి నాయకులను సచివాలయాల పరిధిలో పర్యవేక్షణకు కన్వీనర్లుగా నియమిస్తున్నామన్నారు. కన్వీనర్లు వాలంటీర్లతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, జెడ్పిటిసి రాజీ, పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు వినయ్ కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

# కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

మండలంలోని అమృత్‌నగర ఫేస్-2 9,10,11 వీధుల్లో ఉండే విభిన్న ప్రతిభావంతుల స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఆఫ్ యు విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ కోరారు. ఆ మేరకు శుక్రవారం బాధితురాలు ప్రొద్దుటూరు బావమ్మ, షేక్ బీబీ స్థానిక తహశీల్దార్ నజీర్‌అహ్మద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్‌నగర్‌లో 2018లో 101 మంది విభిన్నప్రతిభావంతులకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటి పట్టాలు, హౌసింగ్ రుణాలు మంజూరు చేశారన్నారు. ఇంటి పట్టాలు వచ్చిన విభిన్నప్రతిభావంతులు 2019లో బేస్ మట్టాలు వేసుకున్నారని తెలిపారు. అమృత్‌నగర్‌లో కొందరు ముఠాలుగా ఏర్పడి గతంలో రద్దు చేసిన ఇంటి పట్టాల నకిలీ పట్టాలు తయారు చేసి, రెవెన్యూ అధికారులే తమకు స్థలాలు ఇచ్చారని కబ్జా చేసి లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులు ఈ స్థలాలు మావని అడిగితే మీకు దిక్కున చోట చెప్పుకోండి.. మేము ఎక్కడికి రామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. విభిన్నప్రతిభావంతుల చట్టం 2016 ప్రకారం కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ రికార్డు ప్రకారం లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని కోరారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అఫ్జల్

# సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - చాపాడు**

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేతవరం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో డ్రయినేజీ సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. సచివాలయ నిధులు కింద వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం ద్వారా లక్ష్మీపేట సచివాలయ పరిధిలో రూ.16 కోట్లు ఖర్చు చేశామన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ టిడిపి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, జెడ్పిటిసి రాజీ, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుభాని, మండల అధికారులు, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, సర్పంచు శ్రీవిద్య, సచివాలయ కన్వీనర్లు శంకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు పివి రమణారెడ్డి, జయ సుబ్బారెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**ముద్దనూరు :**

మండలంలోని శెట్టివారిపల్లె గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్ల పని తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, యూత్ అధ్యక్షులు సుమంత్, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాభిమానం చూరగొనాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ఏ విషయమైనా రాజకీయంగా పరిజ్ఞానంతో మాట్లాడి ప్రజాభిమానం చూరగొనాలని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌రెడ్డికి 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి హితవు పలికారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిడిమిడి జ్ఞానంతో సిఎం జగన్, ఎమ్మెల్యే రాచమల్లుపై నిందలు వేయడం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజల్లో అభాసుపాలవుతావని సూచించారు. పట్టణ పరిధిలో దాదాపు 33,000 ఫించన్లు ఉన్నాయని, పలు కారణాలు చూపుతూ వీటిలో దాదాపు 2వేల పింఛన్ దారులకు నోటీలు మాత్రమే ప్రభుత్వం పంపిందన్నారు. నిజానిజాలు విచారించి అర్హులకు మళ్లీ మంజూరు చేస్తారన్నారు. అనుభవం ఉన్న టిడిపి నాయకులు ముక్తియార్, ఇవి సుధాకర్‌రెడ్డి చొరవ తీసుకొని ప్రవీణ్‌కు వాస్తవాలు చెప్పాలని కోరారు. అధికారిక ప్రకటనకు ముందే ప్రొద్దుటూరు టిడిపి సీటు తనకే అని ప్రవీణ్ స్వీయ ప్రకటన మానుకొని పేదలకు ఉపయోగపడేలా వ్యవహరించాలన్నారు. ఇప్పటికైనా ఉత్తర కుమారుని ప్రగల్భాలు మాని పరిజ్ఞానంతో ప్రజాస్వామ్యయుతంగా రాజకీయం చేయాలని ఓబులరెడ్డి అన్నారు.

## ప్రయివేట్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలి

**ప్రొద్దుటూరు :** ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రయివేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ సంఘ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని దశాబ్దాలుగా ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చట్టప్రకారం అనేక హక్కులు ఉన్నప్పటికీ యాజమాన్యాలు కనీస సదుపాయాలు కల్పించకుండా బానిసలుగా చూస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు చేసినప్పటికీ విద్యాశాఖాధికారులు పట్టిం చుకోవడంలేదన్నారు. పిఎఫ్ చాలా ముఖ్యమని, దీన్ని తప్పక ఆచరణలో పెట్టాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామని గడ్డం రాజు హెచ్చరించారు.

## ఎస్‌ఎఫ్‌ఐ పతాకావిష్కరణ

**ప్రజాశక్తి - జమ్మలమడుగు**



ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

స్థానిక పాత బస్టాండ్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ స్తూపం వద్ద శుక్రవారం ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్ ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ 1970 డిసెంబర్ 30న అధ్యయనం పోరాటం నినాదంతో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలుగా ఏర్పాటైందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నూతన జాతీయ విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని, పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వంపై తల్లిదండ్రులు, విద్యార్థులందరూ కలిసి పోరాటానికి సిద్ధం కావాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఉద్యమ వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న విద్యార్థి ఉద్యమ వేగు చుక్క ఎస్‌ఎఫ్‌ఐ అని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఆయన జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అందించాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు చిపాటి రాజేంద్రరావు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ సంఘం మరింత బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు అభిలాష్, బాషా, సాయి, సెద్రక్, భాస్కర్, కన్నా పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - మైలవరం**



ఆర్థికసాయం అందజేస్తున్న భూపేష్‌రెడ్డి

ఇటీవల మైలవరం జలాశయంలో పడి చనిపోయిన పల్లా గోవర్ధన్, వరలక్ష్మిల పిల్లలకు శుక్రవారం టిడిపి ఇన్ ఛార్జి దేవగుడి భూపేష్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. దొమ్మర నంద్యాల గ్రామానికెళ్లి పిల్లలను పరామర్శించారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుతో మాట్లాడి పిల్లల ఉన్నత చదువులకు, వారి బంగారు భవిష్యత్తుకు కావలిసిన అన్ని సదుపాయాలు కల్పిస్తూ, టిడిపి పార్టీ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ద్వారా చదివించి మంచి భవిష్యత్తుకు బాట వేస్తామని పిల్లల అవ్వతాత, మేనమామకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దొమ్మరనంద్యాల గ్రామ తెలుగుదేశం నాయకులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

2023 జనవరి నెలలో మాజీ మంత్రి లోకేష్ బాబు చేయనున్న యవగళం పాదయాత్రను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కోరారు. శుక్రవారం వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మండల టిడిపి ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 జనవరి 27న యవగళం పేరుతో నారా లోకేష్ బాబు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. లోకేష్ బాబు రాష్ట్ర వ్యాప్తంగా 4వేల కిలోమీటర్ల 400 వందల రోజులు ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కందుకూరు ఘటనలో చనిపోయిన వారికి రెండు నిమిషాలు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేదర రవికుమార్, ఆర్‌వి రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, వీరబద్ర, గోగుల మల్లికార్జున, పాపిరెడ్డి, పూల అల్లాబక్ష్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు వెంకటయ్య, ఈశ్వరయ్య, యుగంధర్, డక్కా రమేష్, పోతిరెడ్డి శివ, ఇలియాస్, మహబూబ్ షరీఫ్, గోగుల మారుతి, అనిల్, రాజా పాల్గొన్నారు.

**జమ్మలమడుగు రూరల్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, యూత్ నాగేశ్వర్‌రెడ్డి, కిరణ్ రాయల్, భూషిరెడ్డి, పొన్నతోట మల్లికార్జున్, గైబు, రఫీ, బాషా భాస్కర్, సర్దార్ నెల్సన్, ఫిలిప్, కొర్రపాడు రామచంద్రరెడ్డి, కోడికాండ్ల పల్లె రామకృష్ణ, అంకన్న, కిట్టయ్య, గంగరాజు, రఫీ, భాను, రసూల్ నాయక్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, దాదాపీర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పూడికతీత పనులు

**జమ్మలమడుగు :** మున్సిపల్ అధికారులు పట్టణంలోని మురుగు కాలువల్లో పూడికతీతను ముమ్మరం చేశారు. అందులోని వ్యర్థాలు, పూడికను తొలగింపును శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా నూర్‌బాషా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు వ్యర్థాలను రోడ్లపై వేయరాదన్నారు. చెత్తా చెదారం ఇండ్ల వద్దకు వచ్చే కార్మికులకు అందజేయాలని సూచించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు వేరుచేసే పరిశుద్ధ కార్మికులకు అందించాలని ఆయన కోరారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



పూడికలను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు